ఆత్మహత్య

వంట పనంతా ముగించుకొని వంట యింట్లోనే గోడ కానుకొని కూర్చుంది సీతమ్మ దిగులుగా. ఆమె ముప్పై యేండ్ల జీవితంలో యింత దిగు లెన్నడూ అనుభవించి వుండలేదు. ఉదయం నుండి యేదో అర్థం కాని బాధ, అవ్యక్తమైన ఆవేదన ఆమె మనసును ఆవరించినాయి. ఆమె ఈ యింటికి వచ్చింది కూడా యీ దినం ఉదయమే .... యీ ఊరికి రావడమూ యీ దినమే. ఈ యింట్లో అడుగు పెట్టినప్పుడే ఆరంభమైన ట్లుంది ఆమె దిగులు.

పల్లెటూర్లో పుట్టి పెరిగిన సీతమ్మకు టౌనులో సుఖాలన్నీ సులభంగా అందుబాటులో వుంటాయని ఒక అస్పష్టమైన అభిప్రాయం వుండేది. అందుకనే ఆమె ఉత్సాహంగా బయలుదేరింది, తొలిసారిగా టౌను కాపురం చేయడానికి. తీరా టవునుకు వచ్చి తను కాపురం చేయవలసిన యీ యిల్లు చూసేటప్పటికి ఆమె ఉత్సాహమంతా నశించింది. అప్పుడే ఆమె క్రిష్ణమూర్తితో పేచీ పెట్టింది — "ఇదేం కొంపండీ! యింతకంటే జైల్లో వున్నా బాగుంటుందే!" అని. "బాగానే వుంటుంది. కానీ యే ఘనకార్యమూ చేయందే, నిన్ను జైల్లో యెవరుండనిస్తారూ?" అన్నాడు భర్త. ఆమె కంఠం హెచ్చింది విసుగ్గా అన్నది: "అది గాదండీ! ఈ వూర్లో యింతకంటె మంచి యిండ్లు లేవా అని?" కృష్ణమూర్తి కంఠం తగ్గించి శాంతంగా జవాబు చెప్పినాడు: "యెందుకు లేవూ? అద్దె కొద్దీ వుంటాయి. ఈ యింటికి పదిరూపాయలు అద్దె. మరి నా జీతంలో యింటికిగాను ఎంత ఖర్చుపెట్టమంటావో చెప్పు." ఆ తరువాత

ఆమెకు నోట మాట రాలేదు. బడిపంతులుకు వచ్చే జీతంలో యింతకంటే మంచి యిల్లు యీ ఊరిలో దొరకదని ఆమెకు అర్థమైంది. అప్పటి నుండే ఆమెలో దిగులు ఆరంభమైనట్లుంది. పగలంతా కొత్త సంసారం సర్దుకోవడంలో ఆ దిగులులేమీ తగ్గలేదు. పైగా మధ్యాహ్నం నుండి జైలు వంటి యింటిలో ఒంటిగా వుంది. యెన్నడూ యెరుగని ఒంటరితనం దిగులుకుతోడై సాయంత్ర మయ్యేటప్పటికి గుండెల్లో బరువుగా తయారైంది.

దిగులుగా కూర్చున్న సీతమ్మ మనసులో ఆమెకు తెలియకుండానే ఆలోచనలు బయలుదేరినాయి. ఈయన త్వరగా యింటికొస్తే బాగుండును. ఈకొత్త ఊర్లో నన్నొంటిగా వదలిపెట్టి యింకా యెక్కడ తిరుగుతున్నాడో? యిరుగు పొరుగులవారి నెవరినైనా త్వరగా పరిచయం చేసుకోవాలి. లేక పోతే రోజూ పగలంతా యీ బందిఖానాలో ఒంటిగావుంటే పిచ్చెత్తుతుంది.... సాయంత్రం 5 గంటలకే స్కూలు ఐపొయ్యుంటుంది, ఈ పాటికి యెప్పుడో యింటికి రావలసింది .... ఒకరిద్దరు పిల్లలున్నా సరిపొయ్యేది. కొంత పొద్దుపోతుంద వాళ్ళతో .... పిల్లలుంటే ఈ సంసారం యింకా దుర్భరంగా వుంటుందంటాడు నిజమేనేమో? .... ఐనా ఈ ఒంటరితనం కంటె ఆ బాధే మేలేమో? ....

హఠాత్తుగా సీతమ్మ ఆలోచనలకు అంతరాయం కలిగింది. వెనుక వైపు సందులో కేకలూ, అరుపులూ వినబడినాయి. ఆమె బద్ధకంగా లేచి సందు తలుపు తెరచి చూసింది. ఏడెనిమిది మంది పోలీసులు అటూ యిటూ పరుగెత్తుతున్నారు — ఇద్దరాడవాళ్ళు కంగారుగా పరుగెత్తుతున్నారు — పోలీసువాళ్ళను తప్పించుకోడానికేమో, పోలీసు వ్యవహారమని అర్థమౌతూనే ఆమె తిరిగి వచ్చి యథాస్థానంలో కూర్చుంది. సందులో పోలీసు బూటు కాళ్ళ చప్పుడు వినబడుతూనే వుంది.

ఐదు నిమిషాలు — పది నిమిషాలు — గడచింది. అప్పుడు జ్ఞాపకం వచ్చింది ఆమెకు — సందు వాకిలి మూయకుండా వచ్చిన సంగతి. లేచి తలుపు మూసివస్తామని అనుకుంటూ వుండగానే నాలుగేండ్ల పసిపిల్ల పరుగెత్తుకుంటూ లోపలికి వచ్చి, తలుపుచాటున నక్కింది. సీతమ్మ ఆశ్చర్యంగా "యెవరు? యెవరు పాపా నువ్వు?" అని అడిగింది తొందర తొందరగా. ఆ అమ్మాయి ఉలికిపడి సీతమ్మవైపు తిరిగింది. గుడ్డి లాంపు వెలుతురులో అమ్మాయి ముఖం మసకగా కనిపించింది. ఆ ముఖం చూస్తూనే సీతమ్మకు అర్థమైంది — ఆ అమ్మాయి యింత వరకు భయంతో యేడుస్తూ వుండిందని. ఆ యేడుపు ముఖం చూసేటప్పటికి ఆమె బద్ధకమంతా వదలి లేచి వాకిలి దగ్గరికి పోయింది. తలుపు గడవేసి, "ఏమమ్మా, నిన్నెవరేమన్నారు?" అని అమ్మాయిని బుజ్జగిస్తూ ఎత్తుకొని వంట గది దాటి ముందు గదిలోకి వచ్చి కూర్చుంది. అంతవరకూ మౌనంగా వుండిన అమ్మాయి సీతమ్మ ముఖంలోకి నిదానంగా చూసి, "అమ్మ, అమ్మ" అంటూ బావురుమని యేడ్చింది. సీతమ్మ యింకా బుజ్జగిస్తూ "మీ అమ్మ కేమైందమ్మా? చెప్పు, యేడ్వకుండా చెప్పు" అని అడిగింది.

ఏడ్పు కొంచెం తగ్గించి అమ్మాయి జవాబు చెప్పింది: "పోలీసులు పట్టుకున్నారు."

"ఎందుకు?" సీతమ్మ ఆదుర్దాగా అడిగింది.

అమ్మాయి సమాధానం చెప్పకుండా ఏడ్పు మళ్ళీ యెక్కువ చేసింది. దీనంగా ఏడ్చే ఆ అమాయకమైన పసిముఖం చూసి సీతమ్మకు కండ్లలో నీళ్ళు తిరిగి, అమ్మాయిని రొమ్ముకు హత్తుకొని లాలించింది. మూడు నిమిషాలలో ఆ అమ్మాయి గట్టిగా ఏడ్వడం మానుకుందిగానీ, నిశ్శబ్దంగా

వెక్కి వెక్కి యేడుస్తూనే వుంది. సీతమ్మ అమ్మాయిని చాపమీద పండ బెట్టి జోకొట్టుతూ నిద్రబుచ్చింది.

నిద్రపోతున్న అమ్మాయి ముఖంవైపే చూస్తూ కూర్చుంది ఆమె. పసిముఖం అమాయకంగా, అసహాయంగా వుంది ; కోమలంగా, కరుణా జనకంగా వుంది ; దీనంగా వేయి కంఠాలతో తన సహాయాన్ని అర్థిస్తున్నట్లుంది. 'ఈ అమ్మాయిని పెంచుకుంటే ?' హఠాత్తుగా కలిగిన ఆలోచనతో ఆమెకు వివశత్వమంతా వదలి పసిపాపవైపు తేరిపారజూసింది. నిద్రాణమైన సంతానవాంఛ ఆమెలో పొంగులువారింది. జాగృతమైన మమకారం హృదయంలో గంతులు వేసింది. చేతులు చాచి నిద్రపోతున్న పసిపాపను యెత్తుకొని మరొకసారి రొమ్ముకు హత్తుకుంది. నిద్రలో దీనంగా మూల్గిన పసిపాపను మళ్ళీ పండబెట్టి ఆప్యాయంగా వాత్సల్యంతో ఒళ్ళంతా నిమిరింది.

క్రిష్ణమూర్తి తలవాకిలి తెరచుకొని యింట్లోకి వస్తూనే అన్నాడు : "కొత్త ఊర్లో అప్పుడే స్నేహితులు దొరికినారే !"

సీతమ్మ ఉత్సాహంగా చెప్పింది : "ఇటు వచ్చి అమ్మాయిని చూడండి."

అతను అమ్మాయి ప్రక్కన కూర్చొని చూస్తూ, "అమ్మాయి కేం — ముద్దుగా వుంది" అన్నాడు.

"ముద్దు సరే — ఆ ముఖం చూస్తే మనమే పెంచుకుందామని అనిపించడం లేదూ ?" సీతమ్మ భర్త ముఖంలోకి ఆశగా చూసింది.

క్రిష్ణమూర్తి చిరునవ్వు నవ్వుతూ అడిగినాడు : "ఇంతకూ యీ అమ్మాయి యెవరని ? తల్లిదండ్రులు లేరా ?"

ఆమె విచారంగా జవాబు చెప్పింది. "యెవరో పాపం, సందులో

నుండి యేడుస్తూ వచ్చింది. వాళ్ళమ్మను పోలీసులు పట్టుకున్నారట."

క్రిష్ణమూర్తి నిట్టూరుస్తూ లేచి నిలబడినాడు — మౌనంగా పోయి మంచంమీద కూర్చున్నాడు.

సీతమ్మ కుతూహలంగా అడిగింది : "యీ అమ్మాయి యెవరో మీకు తెలుసునా ?"

అతను నిర్లిప్తంగా జవాబు చెప్పినాడు : "తెలియదు."

"మరి ?........................"

ఒక నిమిషం నిశ్శబ్దంగా గడచిన తర్వాత అతను ఆ ప్రశ్నకు జవాబు చెప్పినాడు — మెల్లగా — తప్పుచేసిన వాని మాదిరి : "నాకీ సాయంత్రమే తెలిసింది — ఆ సందులో అందరూ భోగంవాళ్లే."

సీతమ్మ కొక్క క్షణం మనసు నిశ్చేతనమైంది. తరువాత మెల్లగా అమ్మాయి ముఖంవైపు చూసింది. మళ్ళీ భర్త ముఖం వైపు చూసింది. తిరిగి పసిపాప ముఖం వైపు చూసింది. ఆ ముఖం అదే విధంగా వుంది — అమాయకంగా — అసహాయంగా — కోమలంగా — కరుణా జనకంగా. ఆ ముఖములో యెక్కడా పతిత జీవిత లక్షణాలు లేవు — పాపపు ఛాయలు లేవు.

"యేం — అమ్మాయిని పెంచుకుందా మంటావా ?" క్రిష్ణమూర్తి మెల్లగా అడిగినాడు.

ఆ ప్రశ్న విని సీతమ్మ ఆ అమ్మాయి తల్లిని ఊహించుకోబోయింది. వెంటనే అసహ్యంతో వొళ్ళంతా గగుర్పొడిచింది. "ఛీ ! ఒళ్ళమ్ముకొని యెట్లా బ్రతుకుతారో — సిగ్గయినా లేకుండా" అన్నది, తన అసహ్యమంతా కంఠంలో కూరి.

క్రిష్ణమూర్తి ఒక విషమహాసం చేసి అన్నాడు: "ఒళ్ళమ్ము కోకుండా యెవరు బ్రతుకుతున్నారని!"

ఆమెకు చిరాకు కలిగింది. "ఆడవాళ్ళందరూ అంతే నంటారా?"

"ఆడవాళ్ళేకాదు. మగవాళ్ళుకూడా అంతే — కొందరు దేహం మాత్రమే అమ్ముకొంటారు. కొందరు బుద్ధి అమ్ముకుంటారు, కొందరు హృదయమే అమ్ముకొంటారు. యేదీ అమ్ముకోకుండా బ్రతికే పద్ధతి మన దేశంలో యింకా యెవరూ కనిపెట్టలేదు."

ఈ వేదాంతమేమిటో ఆమెకు అర్థం కాలేదు. అర్థం చేసుకునే ప్రయత్నం కూడా ఆమె చేయలేదు. అర్థంకాని వేదాంతం అప్పుడప్పుడూ అతని నోటి వెంట వినడం ఆమెకు మామూలే.

"చెప్పు — పెంచుకుందా మంటావా?" క్రిష్ణమూర్తి మళ్ళీ అడిగినాడు. అతని కంఠంలో పల్చని పరిహాసం వున్నట్లుంది.

సీతమ్మ చూపు మళ్ళీ అమ్మాయి ముఖంమీదికి పోయింది. ఆమె లోని మమకారం మళ్లీ కంఠం విప్పబోయింది. కానీ ఆమె రక్తంలో జీర్ణించిన పురాతన పతివ్రతలందరూ సమైక్యంగా ఆందోళన చెందినారు — ఏకగ్రీవంగా హాహాకారం సల్పినారు.

వీలులేదు — యీ అమ్మాయిని పెంచుకునే అవకాశం లేదు — అది సాధ్యంకానే కాదు. ఆమె హృదయాకాశంలో గాఢాంధకారం వ్యాపించి నట్లయింది. యెవరో తన్ను మోసం చేస్తున్నారు. వెలుగుచూపి, ఆశరేపి, హఠాత్తుగా అగాధంలోకి త్రోసినారు. యెవరో? యెవరో యీ వంచకులు? యెవరో యీ కనపడని శత్రువులు? తాను వంచింప బడింది. వంచిత హృదయంలో కించ కలిగింది. ఆవేదనకు అవమానం తోడైంది. ఆమెకు యెవరిమీదనో కోపం వచ్చింది. యెవరిమీదనో

ఆమెకే తెలియదు. హృదయం ఒక సుడిగుండం — అస్పష్టవేదనలు వెళ్ళగ్రక్కే విషభుజంగం — అజ్ఞాత శత్రువులు దాగిన కీకారణ్యం.

సీతమ్మ మౌనంగా కూర్చుంది. ఆమె రక్తమంతా గడ్డకట్టినట్లుంది. శరీరం నిశ్చేతనంగా వుంది. అన్నీ మరచి, భర్త భోజనం సంగతి మరచి, భర్తతో మాట్లాడడం కూడా మరచి, ఆమె మౌనంగా కూర్చుంది.

వున్నట్లుండి సందు తలుపు దబదబా చప్పుడైంది. "యెవరో పిలుస్తున్నారు చూడు" అన్నాడు క్రిష్ణమూర్తి. సీతమ్మ లేచిపోయి సందు తలుపులు తెరిచింది. ఎదురుగా వున్న స్త్రీ "మా పద్మ వచ్చిందా?" అని అడిగింది. ఔనంటూ సీతమ్మ ఆ స్త్రీని ముందు గదిలోకి పిల్చుకొని వచ్చింది. నున్నగా దువ్విన తల, తలనిండా పూలు, గుడ్డి వెలుతురులో కూడా స్పష్టంగా కనపడే ముఖంమీది పౌడరు, అంగ రేఖలు ఆవిష్కరించే చీర, యవ్వనం స్ఫురింపచేసే రవిక; సీతమ్మ కంతా అసహ్యంగా వుంది. ఆమెను త్వరగా పంపించే ఉద్దేశంతో "యిదుగో మీ పద్మ — యెత్తుకపో" అన్నది.

క్రిష్ణమూర్తి ఆమెను అడిగినాడు: "నిన్న పోలీసులు పట్టుకపోలేదా?"

"పోలీసు స్టేషన్‌లో కేసు రాసుకొని వదలిపెట్టినారు. రేపు కోర్టులో ఐదో పదో వడ్డిస్తారు. అదంతా మాకు మామూలే లెండి," ఆమె చిలిపిగా సమాధానం చెప్పి కిలకిల నవ్వింది.

ఆమె ప్రవర్తన సీతమ్మకు దుర్భరంగా వుంది.

క్రిష్ణమూర్తి ఆమె ముఖంలోకి పరీక్షగా చూస్తూ "పద్మను మేము పెంచుకుంటాం — యిస్తావా?" అన్నాడు.

ఆమె మరింత వెకిలిగా నవ్వుతూ "మా పద్మను ఉద్ధరించాలను

కున్నారా ? మీ ఉద్ధరింపులు మాకు వద్దులెండి" అన్నది.

సీతమ్మ కోపం పట్టలేకపోయింది. "నీ బిడ్డ మర్యాదగా బ్రతకడం నీ కిష్టం లేదా ?" అన్నది తీవ్రంగా.

"మర్యాద !" అంటూ ఆమె పగలబడి నవ్వింది. మరుక్షణంలోనే నవ్వు అణచుకొని, గంభీరంగా జవాబు చెప్పింది : "చిన్నప్పుడు నేనూ మర్యాదగానే బ్రతికినాను. మగడు చచ్చిన తర్వాత మర్యాదగా బ్రతక లేకనే యీ వృత్తిలో దిగినాను. మొదట చాలా బాధ పడినాను — చిన్నప్పుడు నేర్చుకున్న మర్యాదతో. ఆ మర్యాద నేర్పకుంటే మా పద్మకు ఆ బాధలు గూడా వుండవు. తప్పకుండా నాకంటె సుఖపడుతుంది."

క్రిష్ణమూర్తి సానుభూతి కంఠంతో అన్నాడు : "ఔను పాపం — భర్త లేని స్త్రీకి మన సంఘంలో అనేక బాధలు వుంటాయి."

"మీ పాపం పుణ్యం మాకేం అక్కర్లేదు లెండి," అంటూ ఆమె పద్మ నెత్తుకొని విసురుగా వెళ్ళిపోయింది.

ఆమె పోయిన తర్వాత క్రిష్ణమూర్తి భార్యతో అన్నాడు : "నీ కంటె చిన్నది చూడు. జీవితంలోని లోతులన్నీ చూసింది. ఐనా గుండె చెడలేదు."

సీతమ్మ రోషంతో బుసకొట్టింది : "ఛీ ! యిదీ ఒక బ్రతుకేనా! ఎంత సిగ్గులేకుండా తయారైందో చూడండి. యీ బ్రతుకు బ్రతకక్క-పోతే యేం!"

"ఆత్మహత్య చేసుకొమ్మంటావా ?" క్రిష్ణమూర్తి శాంతంగా అడిగినాడు.

"ఇది మాత్రం ఆత్మహత్య కాదూ ? అంతకు మించిన ఆత్మ హత్య కాదూ ఈమె చేస్తున్న పని ?" సీతమ్మ రెట్టించింది.

అతను నవ్వుతూ సమాధానం చెప్పినాడు. "ఈమె దేహాన్నిగాక ఆత్మనే చంపుకుంటున్నదంటావ్ ? అంతే కదూ ? .... కాదు. ఈమె ఆత్మను చంపుకోలేదు. అభిమానాన్ని మాత్రమే చంపుకుంది. ఈమెను ఆ సందులోకి త్రోసినవాళ్ళు ఆత్మను చంపుకున్నవాళ్ళు. ఈమెను ద్వేషించేవాళ్ళు ఆత్మను చంపుకున్నవాళ్ళు. ఈమెను శిక్షించేవాళ్ళు ఆత్మను చంపుకున్నవాళ్లు."

ఆ మాటల అర్థం కొరకు సీతమ్మ భర్త ముఖమంతా వెదకింది.

(అగస్టు 1958)